సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.82 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 8.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 670 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,592
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,790
నవర (8 గ్రాములు)	రూ.54,320



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

వైఎస్సార్‌సీపీలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. విడవలూరు, మైపాడుకు చెందిన పలువురు నేతలు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

8లో

న్యూస్‌రీల్

ఉగాది పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పుర మందిరంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ హాజరయ్యారు. సురభి గాయత్రి, డాక్టర్ లలిత శిర్డీషా, రాధారాణి, ఆచారి సంధ్య, బైరిశెట్టి సుజన, చెన్నారెడ్డి శరణ్యరెడ్డి, చీదరాల చెన్నయ్య, పులగర శోభన్‌బాబు, ప్రసన్నకుమార్‌ను సత్కరించారు. మురళీమోహన్‌రాజు, డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి, బత్తిన సాయికుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలు నేడు

నెల్లూరు(అర్బన్): ఇంటర్ ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారని ఆర్ఐఓ డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 26,419 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 25,657 మంది హాజరయ్యారని చెప్పారు. results. bie. ap. gov. inలో ఫలితాలను చూడవచ్చని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామాయణ సప్తాహం ప్రారంభం



ఉపన్యాసకుడు రాజశేఖర్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రేబాలవారివీధిలో గల పీటీజీ టవర్స్‌లో శ్రీరామకథా తరంగిణి సప్తాహాన్ని పద్యసారస్వత పరిషత్, నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. బాలకాండంపై అవధాని విద్వాన్ కోట రాజశేఖర్ ఉపన్యసించారు. రామచంద్రుడి బాల్యం, వివాహం తదితర విషయాలను మనోహరంగా వివరించారు. సభకు అధ్యక్షుడిగా పోలవరపు లక్ష్మీనరసింహారావు, సంచాలకుడిగా డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. బైసాని జ్యోతిప్రసాద్, మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల యునీక్ నంబర్ల మార్పు



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు టౌన్ డివిజన్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సెక్షన్ కార్యాలయాల పరిధిలో బిల్లుల యునీక్ నంబర్లు మారాయని ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరపురం, టౌన్‌హాల్, నారాయణరెడ్డిపేట సెక్షన్ల పరిధిలో బిల్లులకు వచ్చే 13 అంకెల్లో ఐదంకెలను మార్చామని చెప్పారు. ఆన్‌లైన్లో బిల్లులను చెల్లించే వినియోగదారులు మారిన నంబర్లను గుర్తించాలని కోరారు.

కొనసాగుతున్న తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దుత్తలూరు పరిధిలో రూ.లక్ష, రాపూరు పరిధిలో రూ.1,99,500 నగదును ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా గురువారం స్వాధీనం చేసుకున్నారు. చిన్నబజార్, దుత్తలూరులో 15 చొప్పున, దగదర్తిలో 16, ఉదయగిరిలో 8.. ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో 124 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు.

ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

- తమ వారికే ఓటేయాలంటూ క్షేత్రస్థాయిలోకి కుటుంబసభ్యులు
- గడప గడపకూ వెళ్లి మమేకమవుతున్న వైనం
- మనసారా ఆహ్వానిస్తూ.. జేజేలు పలుకుతున్న ప్రజలు

స కుటుంబ సపరివారంతో..

సార్వత్రిక ఎన్నికలకు తేదీ సమీపిస్తుండటంతో ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. వీరికి మద్దతుగా వారి కుటుంబసభ్యులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అడుగుతున్నారు. గడప గడపకూ వెళ్లి మమేకమవుతున్న వీరికి ప్రజలు మనసారా స్వాగతం పలుకుతూ.. ఆత్మీయతానురాగాలను పంచుతున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా వాడవాడలా పర్యటిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తమ వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ఆ పార్టీ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ముమ్మరంగా పర్యటిస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలతో అభ్యర్థులు ఇప్పటికే హోరెత్తిస్తుండగా, వీరికి మద్దతుగా కుటుంబసభ్యులూ ప్రచారాన్ని సాగిస్తున్నారు. రోజూ ఉదయం మొదలుకొని రాత్రి వరకు ప్రజలతో మమేకమై ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ విషయంలో కూటమి కంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంది.

నిరంతరం ప్రజలతోనే..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు ప్రజలతో మమేకమై వారికి కలిగిన లబ్ధిని వివరించారు. తాజాగా అభ్యర్థుల కుటుంబ సభ్యులు ప్రజల మధ్యలోకి విస్తృతంగా వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు.. అభివృద్ధిని వివరిస్తూ.. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థిస్తున్నారు. వీరికి ప్రజలు సాదర స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

మేమున్నామనే భరోసా..



ప్రచారంలో నల్లపరెడ్డి రజత్‌రెడ్డి

పార్టీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మద్దతుగా ప్రచారాన్ని కుటుంబసభ్యులు ఉధృతం చేశారు. ఆయన తనయుడు రజత్‌కుమార్ రెడ్డి నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి మేమున్నామనే భరోసాను ప్రజల్లో కల్పిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తన తండ్రిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రసన్న సతీమణి గీతమ్మ సైతం ప్రచారంలో ముందుండి ప్రజల్లో ముమ్మరంగా పర్యటిస్తూ.. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు.

డివిజన్ల వారీగా పర్యటనలు

పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె హిమబిందు విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ఆయా డివిజన్లలో రోజూ పర్యటించి ప్రజలను కలుసుకుంటున్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించాక ఎనలేని అభివృద్ధిని ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేపట్టారని.. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌గా వన్‌గా తీర్చిదిద్దుతారని చెప్తూ ముందుకెళ్తున్నారు. ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఆదాల హిమబిందు

పక్కా ప్రణాళికతో..



ప్రచారంలో అభినవ్‌రెడ్డి

పార్టీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఆయన తనయుడు మేకపాటి అభినవ్‌రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. పార్టీలోని నేతలను సమన్వయం చేసుకుంటూ.. గ్రామస్థాయిలో పార్టీకి పనిచేసేలా కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. తన రాజకీయ చతురతతో తండ్రి విజయానికి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నేతలు, ప్రజలను కలుస్తూ ఎంపీగా విజయసాయిరెడ్డి.. ఎమ్మెల్యేగా తన తండ్రి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.

ఇంటింటి ప్రచారం

పార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ తన ప్రచారంలో కుటుంబ సమేతంగా పాల్గొంటున్నారు. రోజూ ఆయన భార్య లక్ష్మి, కుమారులు వెంకటసాయి, లక్ష్మీనారాయణ ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని లక్ష్మి సాగిస్తుండగా.. లింగసముద్రం, గుడ్లూరు మండలాల్లోని ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రచారాన్ని ఆయన కుమారులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నాటికి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించేలా ప్రణాళికను రూపొందించి ఆ దిశగా ప్రచారం చేస్తున్నారు. ముమ్మర ప్రచారాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.



ప్రచారం చేస్తున్న బుర్రా లక్ష్మి

సమగ్రాభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో



ప్రచారంలో సునంద విజయసాయిరెడ్డి, నేహారెడ్డి

పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. విజయసాయిరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి నెల్లూరు నగర, రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల చెంతకు వెళ్తున్నారు. ప్రజలకు మంచి చేసిన సీఎంను మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. నెల్లూరు లోక్‌సభ పరిధిలో సమగ్రాభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను తన తండ్రి రూపొందించారని, రానున్న ఐదేళ్లలో వీటిని సంపూర్ణంగా అమలు చేస్తారని నేహారెడ్డి చెప్తూ ప్రచారంలో ముందుకెళ్తున్నారు.

ఆశీర్వదించండి..



పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి నసీమా విస్తృత ప్రచారం చేస్తున్నారు. జెండావీధి, సిటిజన్ స్కూల్ వీధి, యర్రదర్గా వీధి, రంగనాయకులపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్నారు. నగర చరిత్రలో తొలిసారి మైనార్టీకి ఎమ్మెల్యే టికెట్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారని, తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని చూసి దీవించండి



చిన్నారి యోగక్షేమాలను ఆరాతీస్తున్న పూజిత

పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమార్తె పూజిత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి.. వారి యోగక్షేమాలను ఆరాతీస్తున్నారు. సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు గడిచిన ఐదేళ్లలో తన తండ్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి ఓటేయాలని వారిని కోరుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి.. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని అభ్యర్థిస్తున్నారు.

రచ్చబండతో జనాల్లోకి..



రచ్చబండలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి

పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి మద్దతుగా ఆయన తండ్రి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రచారం సాగిస్తున్నారు. సంక్షేమ పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారని, ప్రజలను ఓట్లడిగే హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని పేర్కొంటున్నారు. తన సొంత మండలమైన మర్రిపాడులోని పలు గ్రామాల్లో రచ్చబండ పేరుతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్తున్నారు.

కూటమికి తగిన గుణపాఠం చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

వలేటివారిపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ధైర్యంగా ఎదుర్కొనే దమ్ము లేక కూటమిగా ఏర్పడిన ఆ మూడు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కోరారు. వలేటివారిపాలెంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌తో కలిసి గురువారం ఆయన హాజరయ్యారు. తొలుత వీరికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భారీగా హాజరైన అభిమానులతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. తొలుత స్థానిక నాగార్పమ్మ తల్లి ఆలయంలో విజయసాయిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని కొనియాడారు. మన పథకాలను పక్క రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు తన హయాంలో ప్రజల బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. మీకు మేలు జరిగితేనే ఓటేయండని అడిగే దమ్మున్న నేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన బుర్రా మధుసూదన్‌యాదవ్


'వెలిగొండ'తో సస్యశ్యామలం

లింగసముద్రం నుంచి వలేటివారిపాళేనికి డబుల్ రోడ్డును త్వరలో నిర్మించనున్నామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా కనిగిరి, కందుకూరు, ఉదయగిరి సస్యశ్యామలమవుతాయని తెలిపారు. అనంతరం బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడారు. కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు. జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ.. నిజం నిద్ర లేచేసరికే అబద్ధం ప్రపంచమంతా తిరిగొస్తుందని, ఈ తరహాలో చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఇంటికొచ్చి పింఛన్లు అందించే వలంటీర్లపై టీడీపీ అక్కసు వెళ్లగక్కడం దారుణమన్నారు. పార్టీ మండల కన్వీనర్ వీరాస్వామి, మాజీ జెడ్పీటీసీ కూచిపూడి విజయకుమార్, ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ భారతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు అనుమోలు లక్ష్మీనరసింహం, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఈద్ - ఉల్ - ఫిత్ర్

ఈద్ – ఉల్ – ఫిత్ర్ పర్వదినాన్ని ముస్లింలు జిల్లా వ్యాప్తంగా గురువారం వేడుకగా జరుపుకొన్నారు. జిల్లాలోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేసేందుకు వచ్చిన వారితో నెల్లూరు బారాషహీద్ దర్గా ఆవరణలోని ఈద్గా కిక్కిరిసింది. ఒకర్నొకరు ఆలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలను తెలుపుకొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బారాషహీద్ దర్గాలో సామూహిక ప్రార్థనలు

కోడ్ ఉల్లంఘనలపై దృష్టి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖేష్‌కుమార్ మీనా

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో కోడ్ ఉల్లంఘనలు, నగదు స్వాధీనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, నెల్లూరు, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వికాస్ మర్మత్, సేతు మాధవన్, మలోల తదితరులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని.. కోడ్‌ను ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మద్యం విక్రయాలు, గోడౌన్లలో నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘాను ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు

ఎన్నికల నిర్వహణకు జిల్లాలో చేపడుతున్న చర్యలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ హరినారాయణన్ వివరించారు. జిల్లాలో ఓటరు దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 2460 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ర్యాండమైజేషన్‌ను శుక్రవారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను సమర్థంగా పూర్తి చేసేలా అన్ని చర్యలను చేపడుతున్నామని తెలిపారు. ఎంసీఎంసీ కమిటీని ఏర్పాటు చేసి రాజకీయ పార్టీల ప్రకటనలకు అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 137 ముందస్తు అనుమతులను మంజూరు చేశామని వెల్లడించారు. ఏఎస్పీ సౌజన్య, నోడల్ అధికారులు శర్మద, ప్రసాద్‌రావు, సదారావు, బాపిరెడ్డి, సాలెంరాజు, చందర్, అనిత, పద్మాదేవి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు

ముత్తుకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలతో సమీక్షించి.. సమస్యాత్మక గ్రామాలపై ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్ల పరిధులు, సిబ్బంది వివరాలను ఆరాతీశారు. మద్యం అక్రమ రవాణా, గంజాయి, నాటుసారాను అరికట్టేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిడతాపోలూరు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సందర్శించి.. వాహనాల తనిఖీలను పరిశీలించారు.



చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న ఆరిఫ్ హఫీజ్

క్లుప్తంగా

మూడు గడ్డివాములు దగ్ధం

• రూ.3 లక్షలకు పైగా నష్టం



కాలిపోతున్న గడ్డివాములు

ఆత్మకూరు: మండలంలోని బండారుపల్లి గ్రామంలో పశువుల మేత కోసం సిద్ధం చేసిన వరి గడ్డి దగ్ధమై రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిన ఘటన గురువారం జరిగింది. బాధితులు, ఫైర్ సిబ్బంది కథనం మేరకు.. బండారుపల్లి గ్రామానికి చెందిన కుక్కపల్లి వెంకటేశ్వర్లు, రవి, వేణు తదితర రైతులు ఇటీవల వరి కోతలు పూర్తయిన అనంతరం ఎండు గడ్డిని సేకరించి తమ ఇళ్ల సమీపంలో పక్కపక్కనే వాములు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు ఫైర్ స్టేషన్ అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు కృషి చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో..



కాలిపోయిన సామగ్రి

వెంకటాచలం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆర్టీసీ ఉద్యోగి షేక్ నసురుద్దీన్ ఇంట్లో ఒక్కసారి మంటలు చెలరేగడంతో కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని గుర్తించి వెంటనే సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించి సరఫరాను నిలిపివేశారు. స్థానికంగా ఉన్న యువకులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

పెళ్లయిన ఏడు నెలలకే..

• దంపతుల మధ్య విభేదాలు
• పురుగు మందు తాగిన వైనం.. చికిత్స పొందుతూ భర్త మృతి
• భార్య పరిస్థితి విషమం



సింగయ్య మృతదేహం

గుడ్లూరు: పెళ్లయిన ఏడు నెలలకే భార్యాభర్తలు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. చికిత్స పొందుతూ భర్త మృతిచెందగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని దారకానిపాడులో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలతోటి సింగయ్య (28) అలియాస్ మధుకు కావలికి చెందిన ప్రవల్లికతో వివాహమైంది. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం మళ్లీ గొడవ జరగ్గా.. మనస్తాపానికి గురైన సింగయ్య కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలుపుకొని కొంతమేర తాగాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య అదే కూల్‌డ్రింక్‌ను తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వారిని హుటాహుటిన కందుకూరులోని ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సింగయ్య మృతిచెందాడు. ప్రవల్లిక పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందలేదు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి:	రూ.70
సన్నవి:	రూ.55
పండ్లు:	రూ.24

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	163
లేయర్ (లైవ్):	98
బ్రాయిలర్ చికెన్:	284
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	314
లేయర్ చికెన్:	167

పూలే ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి




నివాళులర్పించిన విజయసాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో గురువారం పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు చిత్రపటానికి విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి చేశారని కొనియాడారు.


రంజాన్ ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నేతలు



దర్గా వద్ద విజయసాయిరెడ్డి, ఆదాల, బీద, రామిరెడ్డి, పర్వతరెడ్డి తదితరులు



ఆత్మకూరు ఈద్గా మైదానంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(బృందావనం): నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద గురువారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ అసెంబ్లీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు వారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

• **ఆత్మకూరు:** రంజాన్ పండగను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



వింజమూరు ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• **ఉదయగిరి:** వింజమూరులోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేను లోకల్.. సోమిరెడ్డి నాన్ లోకల్



ప్రభగిరిపట్నంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'సర్వేపల్లి నియోజకవర్గానికి నేను లోకల్. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాన్ లోకల్. ఆయన ఐదేళ్లకొకసారి చుట్టపు చూపుగా వచ్చి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నించడం భంగపడి వెళ్లిపోవడం జరుగుతోంది' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉలవరపల్లి, ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం, బత్తులపల్లి, నేదురుమల్లి, వెలికంటిపాళెం గ్రామాల్లో మంత్రి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఎదుర్కోలేక మూడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ప్రజలను ముంచాలని చూస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు ప్రజలకు చేసే మేలు గురించి చెప్పకుండా జగన్‌మోహన్‌రెడ్డిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రజలు ఓట్లు వేయాలని, మోసకారి చంద్రబాబును నమ్మొద్దని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నావూరు రోడ్డు నిర్మాణం కోసం రూ.10.83 కోట్లు మంజూరు చేయించి పనులు చేపట్టామన్నారు. ఇందువల్ల అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం, నేదురుమల్లి, బత్తులపల్లి గ్రామాలకు కూడా ఉపయోగం ఉందన్నారు. నావూరు చప్టాపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు చేయడంతో శరవేగంగా పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇలాంటి పనులకు తాను మంత్రి అయిన తర్వాత నిధులు సాధించడం జరిగిందన్నారు.

ఎక్కడున్నాడు?

కరోనా కష్టకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సోమిరెడ్డి ఎక్కడ దాక్కున్నాడని కాకాణి ప్రశ్నించారు. ఆనాడు పట్టించుకోకుండా ఇప్పుడు వచ్చి రాజకీయం చేయాలని చూస్తే ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. మూడోసారి సోమిరెడ్డి సర్వేపల్లిలో ఓడిపోవడం ఖాయమన్నారు. మంత్రికి ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పిల్లిపాక పెంచలప్రసాద్, గోగుల విజయ్, కోదండయ్యనాయుడు, ధనుంజయనాయుడు, రావూరు గోపాల్‌రెడ్డి, టి.పెంచలనాయుడు, ఉడతా రమేష్, సీహెచ్ చంద్రమౌళి, పి.వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

• కలెక్టర్ హరినారాయణన్



నివాళులర్పించిన కలెక్టర్, జేసీ, డీఆర్వో, కమిషనర్

నెల్లూరు(బారకాసు): జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. జ్యోతిరావు జయంతి సందర్భంగా గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో లవన్నతోపాటు పలువురు జిల్లాస్థాయి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు కృషి చేసిన పూలే ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంటరానితనం నిర్మూలనకు ఆయన కృషి చేశారన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం పనిచేశారని, అలాంటి వ్యక్తి సేవలను స్మరించుకోవడం అందరి బాధ్యతని చెప్పారు. విద్యతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి పూలే అని పేర్కొన్నారు. మహిళా అభ్యున్నతికి, బాలికా విద్యా వ్యాప్తికి ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, సమాచార సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, అడిషనల్ కమిషనర్లు శర్మద, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మీకు అండగా ఉంటా : ప్రసన్న



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇందుకూరుపేట మండలం వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి అండగా ఉంటానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో టీడీపీకి షాక్ తగిలింది. విడవలూరు, మైపాడుకు చెందిన నాయకులు, వారి అనుచరులు గురువారం నెల్లూరులో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన బీసీ సెల్ మండలాధ్యక్షుడు చేవూరు కమలాకర్ ఆధ్వర్యంలో 100 మంది, ఇందుకూరుపేట మండలం మైపాడు దళితవాడకు చెందిన చింతల శ్రీనివాసులు, చెముడుగుంట శ్రీకాంత్, పుట్టా అశోక్, రొండా వెంకటేశ్, నాగూరు దిలీప్, 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరగా ప్రసన్న కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు పార్టీ మారకుండా టీడీపీ పెద్దలు డబ్బు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. అయితే కోవూరు అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీలో చేరామని, ప్రసన్నపై తమకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కోవూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నమ్ముతున్న ఇతర పార్టీ నేతలు సైతం స్వచ్ఛందంగా తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి ఓటర్లపై చూపించే కపటప్రేమను ఎవరూ నమ్మరన్నారు. అన్ని మండలాల్లో పర్యటించానని, తమకు సంక్షేమ పథకాలు అందాయని ప్రజలు చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, గుద్దంటి జానకిరామయ్య, తాతా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

• ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ శ్రీనివాసులు

నెల్లూరు(క్రైమ్): 'ప్రజల భాగస్వామ్యంతో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని దాడులు ముమ్మరం చేయాలి. అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టాలి. ఎన్నికలు ముగిసేంత వరకూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలి' అని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. నెల్లూరు బీవీ నగర్‌లోని ఎస్ఈబీ కార్యాలయంలో ఆయన జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మద్యం రహిత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అక్రమ రవాణా, అనధికార విక్రయాలు, నిల్వలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఓటర్లను మద్యం, సారా ద్వారా ప్రలోభాలకు గురిచేయకుండా నివారించాలన్నారు.

రూ.5.28 లక్షల విలువైన మద్యం సీజ్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి దాడుల వివరాలను డీసీ వెల్లడించారు. నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి 11 కేసులు నమోదు చేశామన్నారు. 2,100 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామని తెలిపారు. పొరుగు మద్యం విక్రయాలపై మూడు కేసులు నమోదు చేసి మూడు లీటర్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అనధికార విక్రయాలపై 191 కేసులు నమోదు చేసి 194 మందిని అరెస్ట్ చేసి 498 లీటర్ల మద్యం, 349 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు రూ.5,28,168 విలువచేసే మద్యంను సీజ్ చేశామన్నారు. దాడులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలు, అక్రమ రవాణా, నిల్వలు, పంపిణీ జరుగుతున్నట్లు గుర్తిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500 లేదా స్థానిక ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బాబు శ్రీధర్, ఏఈఎస్ కె.ప్రభాకర్, నెల్లూరు, నెల్లూరు-2, బుచ్చి, ఇందుకూరుపేట, పొదలకూరు, కోవూరు ఇన్‌స్పెక్టర్లు ఆర్.విజయభాస్కర్, ఎస్.రాగమయి, యశోధర, శ్రీనివాసులు, వెంకటరావు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో తెలుగు యువత నాయకుడి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: తెలుగు యువత నెల్లూరు రూరల్ ఉపాధ్యక్షుడు అంబటి మణికంఠ యాదవ్ గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అతనికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నాయకులు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. అందరం కష్టపడి పనిచేసి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైవీ హరీష్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.